# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ ఆదివారం 15 ఫిబ్రవరి 2026 | www.balagamtv.com | పేజీలు 4




పాఠకులు, ప్రకటనకర్తలు, ఏజెంట్లు, శ్రేయోభిలాషులకు
**మహా శివరాత్రి శుభాకాంక్షలు**
పండుగ సందర్భంగా ఆదివారం పత్రికకు సెలవు.
సోమవారం సంచిక వెలువడదు.



## 'కేసీఆర్ బాపు' పాట విడుదల

**బలగం టీవీ ఆధ్వర్యంలో ప్రత్యేక గీతం... కేటీఆర్ చేతుల మీదుగా విడుదల**

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం దీక్షలు, ఉద్యమాలతో పోరాడిన ఉద్యమ నాయకుడు, తొలి ముఖ్యమంత్రి కే. చంద్రశేఖర్ రావు జన్మదినం (ఈనెల 17)ను పురస్కరించుకుని ప్రత్యేక గీతాన్ని విడుదల చేశారు. "బిడ్డా నీకు పెద్దాయన కథ చెపుతాను జర ఇందురాయే.." అంటూ రూపొందించిన 'కేసీఆర్ బాపు' పాటను బలగం టీవీ ఆధ్వర్యంలో నిర్మించారు.

ఈ పాటను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ శనివారం విడుదల చేశారు. కేసీఆర్‌కు ముందస్తు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ ఈ గీతాన్ని సమర్పించినట్లు బలగం టీవీ సీఈఓ బాలు కాయితీ తెలిపారు. పాటకు లిరిక్స్ అందించిన కవి-గాయకుడు మాట్ల తిరుపతికి, స్వరపరిచిన గాయని మధుప్రియకు, సంగీతం అందించిన ఎస్.కె. మదిన్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఎడిటింగ్ చేసిన కొడం అజయ్‌కు, నిర్మాణానికి సహకరించిన గోవర్ధన్‌కు హృదయపూర్వక ధన్యవాదాలు




తెలియజేశారు. తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్ పోరాట స్ఫూర్తిని ప్రతిబింబించేలా ఈ గీతం రూపుదిద్దుకున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

## హంగ్ మున్సిపాలిటీల కైవసమే లక్ష్యం

- కీలకంగా తీసుకున్న కాంగ్రెస్
- మంత్రులు, సీనియర్ నేతలతో సీఎం రేవంత్ సమీక్ష సమావేశం
- త్వరలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు
- సీఎంను కలిసిన ఏఐఎఫ్‌బీ కౌన్సిలర్లు



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రంలో మున్సిపల్టీ ఎన్నికల్లో సత్తాచాటిన కాంగ్రెస్ పార్టీ హంగ్ మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు కైవసం చేసుకునేందుకు వ్యూహాలు వేగవంతం చేసింది. ఈ నేపథ్యంలో శనివారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రులు, సీనియర్ నాయకులతో కీలక సమావేశం నిర్వహించారు.మున్సిపల్ ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధించినందుకు మంత్రులను సీఎం అభినందించారు. కలిసికట్టుగా పనిచేయడం వల్లే ఈ విజయాలు సాధ్యమయ్యాయని పేర్కొన్నారు. హంగ్ మున్సిపాల్టీల్లో అనుసరించాల్సిన రాజకీయ వ్యూహంపై సుదీర్ఘంగా చర్చించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ హంగ్ మున్సిపాల్టీలు బీజేపీ, బీఆర్ఎస్‌కు దక్కకుండా చూడాలని ఆదేశించారు. హంగ్ మున్సిపాలిటీలు, కార్పొరే షన్లు తమ ఆధీనంలోకి వచ్చేలా చర్చలు, వ్యూహాలు చేపట్టాలని దిశానిర్దేశం చేశారు. మేయర్, చైర్మన్ పదవుల విషయంలో సమన్వయంతో ముందుకు సాగాలని సూచనలు చేశారు. పార్టీ విజయానికి కృషి చేసిన నేతలకు ధన్యవాదాలు తెలిపారు.

రెండేళ్ల అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ప్రజల్లో విశ్వాసం పెరిగిందని సీఎం పేర్కొన్నారు. ఆ నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ మరింత ముందుకు సాగాలని మంత్రులు, పార్టీ నేతలకు సూచించారు. మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దాలని, అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయాలని ఆదేశించారు.

### త్వరలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు

రాష్ట్రంలో మరో ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం సిద్ధమవుతుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోపే జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల ప్రక్రియను పూర్తిచేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో మంత్రులు, పీసీసీ అధ్యక్షుడు, ఇతర ముఖ్య నాయకులు ఆమోదం తెలిపారు. అయితే దీనిపై అధికారికంగా మరో సారి మంత్రివర్గం భేటీ అయ్యి చర్చించి, నిర్ణయం తీసుకోవాలని నిర్ణయించారు. ఈ ఎన్నికలను కూడా సాధ్యమై నంత త్వరగా పూర్తిచేస్తే, ఇకపై పూర్తిగా పాలనపై దృష్టి పెట్టొచ్చని పలువురు మంత్రులు అభిప్రాయాలు వ్యక్తంచేసినట్టు సమాచారం. అయితే 2026-27 ఆర్థిక సంవత్సర బడ్జెట్ రూపకల్పన, శాసనసభ సమావేశాలు ఉన్నందున ఆ ప్రక్రియ పూర్తి అయ్యాక జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు వెళ్దామని చెప్పినట్టు సమాచారం. శాసనసభ బడ్జెట్ సమావేశాలను 10 నుంచి 12 రోజులు నిర్వహించి, ఆ వెంటనే జెడ్పీటీసీ, ఎమ్‌పీటీసీ ఎన్నికలకు వెళ్దామని చెప్పినట్టు తెలిసింది.

జోగులాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మున్సిపాలిటీని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ కైవసం చేసుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఫార్వర్డ్ బ్లాక్‌కు చెందిన 8 మంది కౌన్సిలర్లు హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. వడ్డేపల్లి శ్రీనివాస్ నేతృత్వంలో కౌన్సిలర్లు కుర్వ పావని, శారద, మంజుల, యుగేందర్‌రెడ్డి, దేవమ్మ, విజయ్‌భాస్కర్, జయశ్రీ, తిమ్మప్ప నగరానికి చేరుకొని సీఎంతో భేటీ అయ్యారు. అనంతరం మీడియాతో కౌన్సిలర్లు మాట్లాడుతూ.. తాము కాంగ్రెస్ పార్టీలో చేరట్లేదని స్పష్టం చేశారు. మున్సిపాలిటీ అభివృద్ధి కోసమే సీఎంను కలిసినట్లు చెప్పారు. అభివృద్ధికి సహకరిస్తామని సీఎం హామీ ఇచ్చినట్లు తెలిపారు.

## అస్సాంలో తొలి హైవే ఎమర్జెన్సీ ల్యాండింగ్ ఫెసిలిటీ ప్రారంభం



- C-130జీ విమానంతో హైవేపై ల్యాండ్ అయిన ప్రధాని మోదీ

**బలగం టీవి, అస్సాం**

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అస్సాం పర్యటనలో భాగంగా దేశంలోని తొలి హైవే ఎమర్జెన్సీ ల్యాండింగ్ ఫెసిలిటీను ప్రారంభించారు. దిబ్రూఘర్ జిల్లాలోని మోరాన్ బైపాస్ వద్ద నిర్మించిన ఈ సదుపాయంపై భారత వైమానిక దళానికి చెందిన సీ-130జీ సూపర్ హెర్క్యులస్ విమానంలో ప్రధాని సురక్షితంగా ల్యాండ్ అయ్యారు. దేశంలో హైవేపై ఈ స్థాయి అత్యవసర ల్యాండింగ్ సదుపాయాన్ని ప్రారంభించడం వ్యూహాత్మకంగా కీలక ఘట్టంగా భావిస్తున్నారు. ఈ ఎమర్జెన్సీ ల్యాండింగ్ ఫెసిలిటీ సాధారణంగా వాహనాల రాకపోకలకు ఉపయోగించే హైవే స్ట్రిప్‌ను అవసరమైతే రన్‌వేగా మార్చుకునేలా రూపుదిద్దుకుంది. అత్యవసర పరిస్థితుల్లో యుద్ధ విమానాలు, రవాణా విమానాలు, హెలికాప్టర్లు ఇక్కడ ల్యాండ్ అవగలవు. ఎగువ అస్సాంలోని ఈ సదుపాయం భారత్-చైనా సరిహద్దుకు సమీపంలో ఉండటం విశేషం. ౹ాజా సుమారు 240 కిలోమీటర్ల దూరంలో ఉంది.

చాబువా ఎయిర్‌ఫీల్డ్‌లో ప్రధానికి లక్ష్మణ్ ప్రసాద్ ఆచార్య, అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిస్వా శర్మ స్వాగతం పలికారు. అనంతరం మోరాన్‌లోని జూఖీ వద్దకు చేరుకున్న ప్రధాని వైమానిక ప్రదర్శనను దాదాపు 40 నిమిషాల పాటు వీక్షించారు.ఈ ప్రదర్శనలో సుఖోయ్ Su-30 MKI, C-130జీ రవాణా విమానాలు, డోర్నియర్ నిఘా విమానాలు, అడ్వాన్స్‌డ్ లైట్ హెలికాప్టర్ తదితర యంత్రాలు హైవే స్ట్రిప్‌పై విజయవంతంగా ల్యాండ్ అయ్యి టేకాఫ్ అయ్యాయి. హెలికాప్టర్లతో అత్యవసర రక్షణ విన్యాసాలు కూడా నిర్వహించారు. ఈ సౌకర్యం యుద్ధ పరిస్థితుల్లోనే కాకుండా విపత్తుల సమయంలో మానవతా సహాయ కార్యక్రమాలకు ఉపయోగపడనుంది.

2021లో ఉత్తరప్రదేశ్‌లో ఇలాంటి హైవే స్ట్రిప్‌పై కూడా ప్రధాని ల్యాండ్ అయిన విషయం గుర్తుచేస్తున్నారు. దేశవ్యాప్తంగా 28-29 ఎమర్జెన్సీ ల్యాండింగ్ ఫెసిలిటీల నిర్మాణానికి ప్రణాళిక రూపొందించగా, ఇప్పటికే 15 పూర్తయ్యాయని రక్షణ వర్గాలు వెల్లడించాయి. అస్సాం పర్యటనలో భాగంగా రూ.5,500 కోట్లకు పైగా విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులను కూడా ప్రధాని ప్రారంభించారు. ఈశాన్య ప్రాంతం చైనా, మయన్మార్, బంగ్లాదేశ్ సరిహద్దులకు ఆనుకుని ఉండటంతో రక్షణ, వ్యూహాత్మకంగా ఈ సదుపాయం కీలకమని అధికారులు పేర్కొన్నారు. వేగవంతమైన సైనిక ప్రతిస్పందన, మెరుగైన లాజిస్టిక్స్‌తో పాటు సాధారణ ప్రజలకు కనెక్టివిటీ పెరగనుందని భావిస్తున్నారు.

గూడెబల్లూరు--మహబూబ్‌నగర్

## జాతీయ రహదారి విస్తరణకు కేంద్రం ఆమోదం

- 3,175 కోట్లతో నాలుగు లేన్లుగా అభివృద్ధి
- హైదరాబాద్--పణజీ ఆర్థిక కారిడార్‌కు ఊతం



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

హైదరాబాద్--పణజీ ఆర్థిక కారిడార్‌లో భాగంగా గూడెబల్లూరు నుంచి మహబూబ్‌నగర్ వరకు జాతీయ రహదారిని నాలుగు లేన్లుగా విస్తరించేందుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. 80.01 కిలోమీటర్ల పొడవైన ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం ?3,175.08 కోట్లుగా నిర్ణయించారు. ఈ పనులను హైబ్రిడ్ అన్యుటీ మోడ్ లో నేషనల్ హైవేస్ (ఒరిజినల్) పథకం కింద అమలు చేయనున్నారు. ఈ నిర్ణయాన్ని ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ ఆమోదించింది.ఈ ప్రాజెక్టుతో తెలంగాణలోని నారాయణపేట, మహబూబ్‌నగర్ జిల్లాలకు గణనీయమైన ప్రయోజనం కలుగనుంది. ఈ మార్గం కర్ణాటక సరిహద్దుకు సమీపంలోని గూడెబల్లూరును మహబూబ్‌నగర్‌తో కలుపుతూ, మరికల్ (తెలంగాణ), దేవసుగూరు (కర్ణాటక) మీదుగా రాయచూర్ వైపు విస్తరిస్తుంది. హైదరాబాద్, వరంగల్ తదితర నగరాల నుంచి కర్ణాటక, గోవా ప్రాంతాలకు సులభ రవాణా సదుపాయం కల్పించడం లక్ష్యం. ఇంధన వినియోగం తగ్గడంతో పాటు ప్రయాణ సమయం కూడా తగ్గనుంది.

ప్రస్తుతం హైదరాబాద్, వరంగల్ నుంచి గోవా, రాయచూర్, మంత్రాలయం ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు జడ్చర్ల--మహబూబ్‌నగర్ మార్గంలో రెండు లేన్ల రహదారినే వినియోగిస్తున్నారు. దీనిని నాలుగు లేన్లుగా మార్చడం వల్ల ట్రాఫిక్ రద్దీ తగ్గి, వేగవంతమైన రవాణా సదుపాయం లభించడంతో పాటు ప్రాంతీయ ఆర్థికాభివృద్ధికి దోహదం చేస్తుందని అధికారులు పేర్కొన్నారు. ఇక మహారాష్ట్రలో ఎన్‌హెచ్-160ఏలో భాగమైన ఘోటీ--త్రింబక్ (మొఖాడా)--జవహర్--మనోర్--పాల్ఘర్ విభాగం అభివృద్ధికి ?3,320.38 కోట్లను జజజూా ఆమోదించింది. నాసిక్ పశ్చిమ ప్రాంతంలోని అంబాద్, సాత్‌పూర్ పారిశ్రామిక కేంద్రాలకు ఇది కీలక మార్గంగా నిలుస్తుంది. ఈ ప్రాజెక్టు పీఎం గతిశక్తి సూత్రాల మేరకు ప్రతిపాదించబడింది.

అలాగే గుజరాత్‌లో ధమాసియా--బిటాడా/మోవీ, నసర్పోర్--మలోతా నాలుగు లేన్ విభాగాల నిర్మాణానికి ?4,583.64 కోట్లను ఆమోదించారు. 107.67 కిలోమీటర్ల ఈ ప్రాజెక్టు ఎన్‌హెచ్-56లో భాగం. రాజస్థాన్‌లోని నింబాహెర నుంచి ప్రారంభమై గుజరాత్, మధ్యప్రదేశ్ గుండా వాపి సమీపంలో ఎన్‌హెచ్-48తో కలుస్తుంది. 100 కి.మీ వేగానికి అనుగుణంగా రూపుదిద్దిన ఈ రహదారి సగటు వేగాన్ని 70 కి.మీకి పెంచి ప్రయాణ సమయాన్ని 2.5 గంటల నుంచి 1.5 గంటలకు తగ్గించనుంది. మొత్తంగా ఈ ప్రాజెక్టులు రవాణా సౌకర్యాల మెరుగుదలకు, ప్రాంతీయ అభివృద్ధికి, లాజిస్టిక్స్ సామర్థ్యాల పెంపుకు దోహదం చేస్తాయని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది.

## ఫార్ములా ఈ-కార్ రేసు కేసులో కీలక మలుపు

- ఐఏఎస్ అధికారి అర్వింద్‌కుమార్ ప్రాసిక్యూషన్‌కు కేంద్ర అనుమతి



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

ఫార్ములా ఈ-కార్ రేసు వ్యవహారంలో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ఐఏఎస్ అధికారి అర్వింద్‌కుమార్‌పై ప్రాసిక్యూషన్‌కు కేంద్ర ప్రభుత్వం అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ)కి అనుమతి ఇచ్చినట్లు సమాచారం. దీంతో దర్యాప్తు తుది దశకు చేరినట్టైంది. తెలంగాణ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు గత ఏడాది డిసెంబర్‌లో ఐఏఎస్ అధికారి ప్రాసిక్యూషన్‌కు అనుమతి ఇవ్వాలని కేంద్ర సిబ్బంది ఒ శిక్షణ విభాగంకు లేఖ రాశారు. ఈ నేపథ్యంలో తాజాగా అనుమతి మంజూరైనట్లు తెలుస్తోంది.

ఇంతకుముందే అవినీతి నిరోధక శాఖ సెప్టెంబర్ 9న తన ప్రాసిక్యూషన్ నివేదికను తెలంగాణ ప్రభుత్వానికి సమర్పించింది. అందులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌ను ఏ1గా పేర్కొంది. ఐఏఎస్ అధికారి అర్వింద్‌కుమార్‌ను ఏ2గా, హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డిని ఏ3గా చేర్చింది. దీనికి అనుగుణంగా తెలంగాణ


మిగితా 2వ పేజీలో

## రాష్ట్ర ప్రజలకు కేసీఆర్ మహాశివరాత్రి శుభాకాంక్షలు

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**



మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రజలకు తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కే. చంద్రశేఖర్ రావు (కేసీఆర్) శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ప్రజలు సుఖశాంతులతో, సుభిక్షంగా జీవించేలా పరమశివుని దీవెనలు లభించాలని ఆయన ఆకాంక్షించారు. సహనానికి, త్యాగానికి ప్రతీకగా, సృష్టి లయకారుడైన ఉమామహేశ్వరుడు హిందూ భక్తులచేత నిత్యపూజలు అందుకుంటారని కేసీఆర్ పేర్కొన్నారు. భక్తి, శ్రద్ధలతో ఆరాధిస్తే సాధారణ భక్తుల కోరికలకూ స్పందించే భోళా శంకరుడిగా భారతీయ ఆధ్యాత్మిక, సామాజిక జీవనంలో పరమశివునికి ప్రత్యేక స్థానం ఉందన్నారు. ప్రాణికోటిని రక్షిస్తూ సృష్టి మనుగడ కోసం గరళాన్ని మింగిన మహా త్యాగి, ఆదియోగి, గరళకంఠుడైన పరమేశ్వరుడిని ఆయన కొనియాడారు. తెలంగాణ ప్రజలకు ఆయురారోగ్యాలు, సుఖశాంతులు ప్రసాదించి రాష్ట్రం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చెందేలా దీవించాలని దేవాదిదేవుడైన చంద్రశేఖరుడిని కేసీఆర్ ప్రార్థించారు.



## బెల్లంపల్లిలో బీఆర్ఎస్‌కు మరింత బలం..

- పార్టీలో చేరిన పలువురు కౌన్సిలర్లు!

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

బెల్లంపల్లి మున్సిపాలిటీలో రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. బెల్లంపల్లికి చెందిన పలువురు కౌన్సిలర్లు బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీ కేటీఆర్ సమక్షంలో గులాబీ గూటికి చేరారు. పార్టీలో చేరిన వారికి కేటీఆర్ పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. 30వ వార్డు స్వతంత్ర కౌన్సిలర్ శంకర్ సింగ్ తో పాటు, కాంగ్రెస్ పార్టీ నుంచి గెలుపొందిన 26వ వార్డు కౌన్సిలర్ కుమారస్వామి అధికారికంగా బీఆర్ఎస్ సభ్యత్వం తీసుకున్నారు.వీరితో పాటు బీజేపీకి చెందిన 34వ వార్డు అభ్యర్థి రామూర్తి కూడా కేటీఆర్‌ను కలిశారు. ఆయన ప్రస్తుతానికి పార్టీలో అధికారికంగా చేరనప్పటికీ, బీఆర్ఎస్ విధానాలకు ఆకర్షితులై పార్టీకి పూర్తి స్థాయి మద్దతును ప్రకటిస్తున్నట్లు తెలిపారు. ఈ చేరికల వల్ల బెల్లంపల్లి మున్సిపాలిటీలో బీఆర్ఎస్ మరింత బలోపేతం కానున్నది.

## కొత్తగూడెం మేయర్ పీఠంపై ఉత్కంఠకు తెర

- కాంగ్రెస్--సీపీఐ పొత్తు ఖరారు..
- మేయర్ సీపీఐకి, డిప్యూటీ మేయర్ కాంగ్రెస్‌కు

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**



సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ, సీపీఐ నేతల మధ్య జరిగిన చర్చలు ఫలించడంతో కొత్తగూడెం మేయర్ పీఠంపై నెలకొన్న ఉత్కంఠకు తెరపడింది. కాంగ్రెస్--సీపీఐ పొత్తుతో మేయర్ పదవిని కైవసం చేసుకోవాలని ఇరు పార్టీలు ఒప్పందానికి వచ్చాయి. మేయర్ పదవిని సీపీఐకి ఇవ్వాలని కాంగ్రెస్ నిర్ణయించగా, డిప్యూటీ మేయర్ పదవి కాంగ్రెస్‌కు ఖరారైంది.

కొత్తగూడెం కార్పొరేషన్‌లో మొత్తం 60 సీట్లకు కాంగ్రెస్, సీపీఐలకు చెరో 22 సీట్లు వచ్చాయి. ముందుగా సీపీఐ, భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్)తో పొత్తు పెట్టుకొని ఎన్నికలకు వెళ్లింది. అయితే బీఆర్ఎస్‌కు కేవలం 8 సీట్లు మాత్రమే లభించాయి. రెండు పార్టీలకు కలిపి స్పష్టమైన మెజారిటీ రాకపోవడంతో సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుతో ఫోన్‌లో మాట్లాడినట్లు సమాచారం. కాంగ్రెస్ మద్దతు ప్రకటించడంతో సీపీఐకి ఊరట లభించింది. పోలింగ్‌కు ముందు వేర్వేరుగా పోటీ చేసినా, చివరకు కలిసి పనిచేయాలని నిర్ణయించడంతో ఇరు పార్టీల మధ్య సయోధ్య కుదిరినట్లయింది. ఈ పరిణామంతో కొత్తగూడెం కార్పొరేషన్‌పై ఎర్రజెండా ఎగరబోతోందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.

## కాంగ్రెస్ ఆశించిన ఫలితాలు రాలేదు...




- బీఆర్ఎస్ గట్టి పోరాటం చేసింది
- హంగ్ వచ్చిన చోట్ల కూడా మాకు విజయావకాశాలు
- మరోసారి ఫార్ములా వ్యవహారాన్ని తెస్తున్నారు.
- ఆ కేసులో ఎలాంటి పస లేదు
- మున్సిపల్ ఎన్నికల ఫలితాలపై కేటీఆర్ మీడియా చిట్‌చాట్

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

మున్సిపల్ ఎన్నికల ఫలితాలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మీడియాతో చిట్‌చాట్ నిర్వహించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఆశించిన స్థాయిలో ఫలితాలు సాధించలేదని ఆయన వ్యాఖ్యానించారు.

"మా పార్టీ కార్యకర్తలు అద్భుతంగా పోరాటం చేశారు. ఓవరాల్‌గా 30కి పైగా మున్సిపాలిటీలు వస్తాయని భావించాం. అయితే వచ్చిన 17 మున్సిపాలిటీలతో పాటు " అని కేటీఆర్ తెలిపారు. బీజేపీ తన పనితీరు బాగుందని చెప్పుకోవడంపై ఆశ్చర్యం వ్యక్తం చేసిన ఆయన, గతంతో పోలిస్తే ఆ పార్టీకి తక్కువ ఓట్లు, వార్డులు వచ్చాయని అన్నారు. జాతీయ అధ్యక్షుడిని తెచ్చి ప్రచారం చేసినా ఒక్క మున్సిపాలిటీ కూడా గెలవలేకపోయిందని విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అధినేతలు తిరగడం వల్ల పెద్దగా ప్రయోజనం ఉండదని, లోకల్ అంశాలు మరియు అధికారంలో ఉన్న ప్రభుత్వానికి సాధారణంగా అనుకూలత ఉంటుందని పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో డబ్బు ప్రభావం విపరీతంగా పెరిగిందని, కాంగ్రెస్ విచ్చలవిడిగా ఖర్చు చేసిందని ఆరోపించారు.

ఫలితాలు అనుకున్నంతగా రాని జిల్లాల్లోనూ పార్టీ శ్రేణులు గట్టి పోరాటం చేశాయని తెలిపారు. పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ సంతృప్తికరమైన పోరాటం చేసిందని పేర్కొన్నారు. గతంలో పార్లమెంట్ ఎన్నికల అనంతరం అడ్డగోలుగా మాట్లాడిన వారికి ఈ ఫలితాలే సమాధానమన్నారు. ఎక్స్-అఫీషియో సభ్యుల నిబంధనల విషయంలో ప్రభుత్వానికే స్పష్టత లేదని విమర్శించారు. "నిన్నటి వరకు కలెక్టర్లు ఒక మాట, చీఫ్ సెక్రటరీ మరో మాట చెబుతున్నారు. ప్రస్తుతం అమల్లో ఉన్న నిబంధనలపై ఎవరికీ స్పష్టత లేదు" అని అన్నారు.

### ఫార్ములా ఈ అంశంపై స్పందన

మరోసారి ఫార్ములా ఈ వ్యవహారాన్ని ప్రభుత్వం తెరపైకి తీసుకువస్తోందని కేటీఆర్ అన్నారు. ఇప్పటికే నాలుగు సార్లు విచారణకు పిలిచినా ఏమీ చేయలేదని, కేవలం రాజకీయ తమాషా కోసం మళ్లీ పిలుస్తున్నారని వ్యాఖ్యానించారు."ఎన్ని సార్లు పిలిచినా వెళ్తాం. ఉన్న సత్యం స్పష్టంగా చెబుతాం. ఎన్ని సార్లు విచారణ చేసినా మాకేం ఇబ్బంది లేదు. చివరికి జైలులో పెట్టినా భయపడేది లేదు" అని ఆయన స్పష్టం చేశారు. ఆ కేసులో ఎలాంటి పస లేదని పోలీసు, ఏసీబీ అధికారులు ముఖ్యమంత్రికి ఇప్పటికే పలుమార్లు తెలిపారని అన్నారు.

ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ ఎన్ని స్థానిక సంస్థలు గెలిచిందని కేటీఆర్ ప్రశ్నించారు. "అప్పుడు కాంగ్రెస్ కేవలం నాలుగు మాత్రమే గెలిచింది. ఇప్పుడు మేమెన్ని గెలిచాం? ప్రజలు ఇవన్నీ గమనిస్తున్నారు" అన్నారు. అలాగే, రేవంత్ రెడ్డి మల్కాజ్‌గిరి ఎంపీగా, కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉన్నప్పుడు జీహెచ్ఎంసీ ఎన్నికల్లో ఎన్ని గెలిచారో గుర్తు చేసుకోవాలని వ్యాఖ్యానించారు. మొత్తంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ గట్టి పోరాటం చేసి సంతృప్తికరమైన ఫలితాలు సాధించిందని కేటీఆర్ పేర్కొన్నారు.

## టీజీ ఈఏపీసెట్--2026 నోటిఫికేషన్ విడుదల

- ఫిబ్రవరి 19 నుంచి దరఖాస్తులు... మేలో పరీక్షలు

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రంలోని ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో 2026--27 విద్యా సంవత్సరానికి ప్రవేశాల కోసం నిర్వహించే టీజీ ఈఏపీసెట్--2026 నోటిఫికేషన్ విడుదలైంది. ఈ ప్రవేశ పరీక్ష ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రొఫెషనల్ కాలేజీల్లో అడ్మిషన్లు కల్పించనున్నారు.ఈసారి కూడా ప్రవేశ పరీక్ష నిర్వహణ బాధ్యతలను జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్సిటీ హైదరాబాద్ (జేఎన్టీయూ--హైదరాబాద్) నిర్వహించనుంది.

**దరఖాస్తుల వివరాలు**

ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రారంభం: ఫిబ్రవరి 19, 2026
ఫైన్ లేకుండా చివరి తేదీ: ఏప్రిల్ 4, 2026
రూ.250 ఫైన్‌తో: ఏప్రిల్ 10, 2026
రూ.500 ఫైన్‌తో: ఏప్రిల్ 15, 2026
రూ.2,500 ఆలస్య రుసుముతో: ఏప్రిల్ 20, 2026
రూ.5,000 ఆలస్య రుసుముతో: ఏప్రిల్ 24, 2026
రూ.10,000 ఆలస్య రుసుముతో: మే 2, 2026

మిగితా 2వ పేజీలో

# కరీంనగర్ మేయర్ పీఠం బీజేపీకి దక్కకుండా కుట్రలు

- **కేంద్ర మంత్రి బండి సంజయ్**

**బలగం టీవీ, హైదరాబాద్**

కరీంనగర్ మేయర్ పీఠం బీజేపీకి దక్కకుండా మూడు పార్టీలు కుట్రలు చేస్తున్నాయని కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆరోపించారు. కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించిందని, స్వతంత్రంగా గెలిచిన పలువురు కార్పొరేటర్లు బీజేపీలో చేరడంతో మేజిక్ ఫిగర్ దాటామని తెలిపారు.కరీంనగర్‌లో ఇండియన్ నేషనల్ కాంగ్రెస్, భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్), ఆల్ ఇండియా మజ్లిస్–ఇ–ఇత్తెహాదుల్ ముస్లిమీన్ (ఎంఐఎం) కుమ్మక్కయ్యాయని విమర్శించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒకటేనని తాము ముందే చెప్పామని, ఈ ఎన్నికల్లోనూ రెండు పార్టీలు కలిసి పనిచేశాయని అన్నారు. ఎన్ని కుట్రలు



చేసినా కరీంనగర్ ప్రజలు బీజేపీకే ఓటేశారని పేర్కొన్నారు.

కాంగ్రెస్, ఎంఐఎం, బీఆర్ఎస్ కలిసినా 26 సీట్లకే పరిమితమయ్యాయని బండి సంజయ్ వ్యాఖ్యానించారు. బీజేపీకి మేయర్ పదవి రానీయకుండా ఆ మూడు పార్టీలు ఒక్కటయ్యాయని ఆరోపించారు. కరీంనగర్ వేదికగా ఈ మూడు పార్టీల బండారం బయటపడబోతోందన్నారు. దిగజారుడు రాజకీయాలను ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు.

మేయర్ పదవి కోసం "గుంట నక్కలన్నీ ఒక్కటయ్యాయి" అంటూ బండి సంజయ్ తీవ్రంగా స్పందించారు. ప్రజా తీర్పుకు విరుద్ధంగా కుట్రలు చేస్తే కరీంనగర్ నుంచే ఎదుర్కొంటామని కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలను హెచ్చరించారు. బీజేపీ శక్తి ఏంటో, కరీంనగర్ ప్రజల దమ్మేంటో చూపిస్తామని అన్నారు. ప్రజా తీర్పును కాలరాస్తే కరీంనగర్‌లో కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలను తిరగనివ్వమని హెచ్చరికలు జారీ చేశారు.

# భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందంపై రాహుల్ గాంధీ ఆగ్రహం

- **'పత్తిరైతులు, వస్త్రరంగానికి తీరని నష్టం'**

**బలగం టీవీ, హైదరాబాద్**

భారత్––అమెరికా మధ్యంతర వాణిజ్య ఒప్పందంలో సుంకాల భారం వల్ల పత్తిరైతులు, వస్త్ర వ్యాపారులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. ఎక్స్ (ట్విట్టర్) ఖాతా ద్వారా కేంద్ర ప్రభుత్వ వైఖరిని ఆయన తీవ్రంగా ఎండగట్టారు. పత్తి రైతులు, వస్త్ర వ్యాపారుల ప్రయోజనాలను రక్షించేలా విజన్ కలిగిన ప్రభుత్వం చర్చలు జరిపి ఉండాల్సిందని రాహుల్ పేర్కొన్నారు. అమెరికా భారత్‌పై 18 శాతం టారిఫ్ విధిస్తుండగా, భారత్ నుంచి అమెరికాకు జీరో శాతం టారిఫ్ ఉంటుందని ప్రభుత్వం చెబుతోందని ఆయన విమర్శించారు. ఈ అంశంపై ప్రధాని నరేంద్ర మోదీ, ఆయన క్యాబినెట్ గందరగోళం సృష్టిస్తున్నారని ఆరోపించారు.

అమెరికాకు వస్త్రాల ఎగుమతుల విషయంలో బంగ్లాదేశ్‌కు సున్నా శాతం టారిఫ్ రాయితీ లభిస్తోందని రాహుల్ గుర్తుచేశారు. అయితే, అమెరికా నుంచి పత్తిని దిగుమతి చేసుకునే షరతుపై ఆ రాయితీ అమల్లో ఉందని తెలిపారు. ఈ విషయంపై పార్లమెంట్‌లో ప్రశ్నించగా, అమెరికా నుంచి పత్తి దిగుమతి చేస్తే భారత్‌కూ ప్రత్యేక రాయితీ లభిస్తుందని కేంద్ర మంత్రి సమాధానం ఇచ్చారని చెప్పారు. "ఈ వాస్తవాన్ని ఇప్పటివరకు ఎందుకు దాచిపెట్టారు? ఈ విధానం వల్ల నిజంగా మేలు జరుగుతుందా? లేక ముందుకు నుయ్యి, వెనక్కు గొయ్యిలో తోసే ప్రయత్నమా?" అంటూ రాహుల్ ప్రశ్నించారు.



**రైతులు, వస్త్రరంగంపై ప్రభావం**

భారత్ అమెరికా నుంచి పత్తిని దిగుమతి చేస్తే దేశీయ పత్తిరైతులు నాశనమవుతారని, దిగుమతి చేయకపోతే వస్త్ర పరిశ్రమ వెనుకబడే ప్రమాదం ఉందని రాహుల్ ఆందోళన వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా, భారత్ నుంచి పత్తి దిగుమతులు తగ్గించే సంకేతాలు బంగ్లాదేశ్ ఇస్తోందని కూడా పేర్కొన్నారు. వస్త్ర పరిశ్రమ, పత్తి సాగు భారత ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకలాంటివని, ఈ రంగాలపై కోట్లాది మంది ఆధారపడి జీవిస్తున్నారని ఆయన అన్నారు. ఈ రంగాలపై దాడి చేయడమంటే కోట్ల కుటుంబాలను నిరుద్యోగం, ఆర్థిక సంక్షోభంలోకి నెట్టడమేనని తీవ్రంగా విమర్శించారు. మోడీ ప్రభుత్వం ఈ ఒప్పందం దేశ ప్రయోజనాలకు అనుకూలమని చెబుతున్నప్పటికీ, వాస్తవానికి ఇది పత్తి రైతులు, వస్త్రరంగానికి తీరని నష్టం కలిగించే ప్రమాదం ఉందని రాహుల్ గాంధీ ఆరోపించారు.

# ఫార్ములా ఈ-కార్ రేసు కేసులో కీలక మలుపు

(మొదటి పేజీ తరువాయి)

గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ నవంబర్ చివరిలో కేటీఆర్‌పై ఛార్జిషీట్ దాఖలు చేయడానికి అనుమతి ఇచ్చారు.

హైదరాబాద్ నగరంలో 2023లో నిర్వహించిన ఫార్ములా ఈ–కార్ రేసింగ్ కోసం విదేశీ సంస్థకు నిబంధనలకు విరుద్ధంగా నిధులు విడుదల చేయడంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి కోట్ల రూపాయల నష్టం వాటిల్లిందన్న ఆరోపణలపై అవినీతి నిరోధక శాఖ ఇప్పటికే కేసు నమోదు చేసింది. పురపాలక శాఖ మంత్రిగా ఉన్న కేటీఆర్ ఆదేశాల మేరకే నిధులు విడుదల చేసినట్లు అప్పట్లో శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీగా ఉన్న ఐఏఎస్ అధికారి అర్వింద్‌కుమార్ ప్రభుత్వం ముందు లిఖితపూర్వక వాంగ్మూలం ఇచ్చినట్లు ఏసీబీ పేర్కొంది. గతేడాది సెప్టెంబర్‌లో ఈ కేసుకు సంబంధించిన పూర్తి నివేదికను ఏసీబీ అధికారులు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించారు. అనంతరం ప్రాసిక్యూషన్ అనుమతి ఇవ్వాలని సిఫారసు చేశారు. కేసు దర్యాప్తులో భాగంగా కేటీఆర్‌తో పాటు అర్వింద్‌కుమార్‌ను ఏసీబీ పలుమార్లు విచారించింది. ఫార్ములా ఈ–కార్ రేసింగ్ వ్యవహారంపై 2024 డిసెంబర్ 18న ఏసీబీ కేసు నమోదు చేసింది. ఈ కేసులో ఏ1గా కేటీఆర్, ఏ2గా ఐఏఎస్ అధికారి అర్వింద్‌కుమార్, ఏ3గా హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డిని నిందితులుగా చేర్చింది. తాజాగా అర్వింద్‌కుమార్‌పై ప్రాసిక్యూషన్‌కు కేంద్రం అనుమతి ఇవ్వడంతో ఈ కేసులో ఏసీబీ త్వరలోనే ఛార్జిషీట్ దాఖలు చేసే అవకాశం ఉందని అధికార వర్గాలు సూచిస్తున్నాయి.

# ఆర్థిక సంవత్సరానికి సమగ్ర కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయండి

**ప్రీ బడ్జెట్ సమీక్షా సమావేశంలో మంత్రి వివేక్**

**బలగం టీవీ, హైదరాబాద్**




రాబోయే ఆర్థిక సంవత్సరానికి సమగ్ర కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసి, అమల్లో ఉన్న పథకాలను సక్రమంగా అమలు చేయటంతో పాటు సేవా వ్యవస్థను పటిష్టంగా మార్చాలని కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి అధికారులను ఆదేశించారు. శనివారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఉన్నతాధికారులతో ప్రీ–బడ్జెట్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ప్రస్తుత ఆర్థిక వ్యయం, అమల్లో ఉన్న పథకాలు, బడ్జెట్ కేటాయింపులు, రాబోయే ఆర్థిక సంవత్సరానికి అవసరమైన నిధుల వివరాలపై ఆయన సమీక్షించారు. కార్మికుల సంక్షేమం, నైపుణ్యాభివృద్ధి అంశాలకు ప్రాధాన్యతనివ్వాలని సూచించారు. అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ల (ఏటీసీల) ద్వారా యువతకు నాణ్యమైన శిక్షణ అందించటం, ఐటీఐల్లో ట్రైనర్లకు ప్రత్యేక శిక్షణ అందించడం, ఈఎస్ఐసీ పరిధిలో ఉన్న బీమాదారులకు మెరుగైన వైద్య సేవలు అందించడం అత్యంత ప్రాధాన్యంగా తీసుకోవాలని చెప్పారు. ఈఎస్ఐసీ ద్వారా రాష్ట్రానికి రావాల్సిన కేంద్ర నిధులపై కచ్చితంగా ఫాలోఅప్ చేయాలనీ, బడ్జెట్ అవసరాలు వ్యయ అంచనాలపై సమగ్ర నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు సేవల మెరుగుదలే శాఖల ముఖ్య లక్ష్యంగా ఉండాలని స్పష్టం చేశారు. నిధుల కొరత కారణంగా ఏ పథకం గానీ, బీమాదారులకు అందించే సేవలు గానీ నిలిచిపోకూడదని మంత్రి స్పష్టంచేశారు. అవసరమైన నిధుల వివరాలను ముందుగానే తెలియజేయాలనీ, తాను ఆర్థిక శాఖ మంత్రి, సీఎంతో సమన్వయం చేసి నిధుల విడుదలకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. టామ్‌కామ్ ద్వారా విదేశీ ఉపాధి, నియామకాల పురోగతిపై సమగ్ర నివేదిక సమర్పించాలని ఆదేశించారు. విదేశీ ఉపాధి అవకాశాలు లక్ష్యానుసారం అమలు కావాలని సూచించారు. అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ల పనితీరు, బడ్జెట్ వినియోగం, శిక్షణ పొందిన యువత సంఖ్య, ప్లేస్‌మెంట్ గణాంకాలపై పూర్తి స్థాయి విశ్లేషణ చేయాలని ఉపాధి, శిక్షణ శాఖ అధికారులను ఆదేశించారు. సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దాన కిషోర్, ఉపాధి, శిక్షణ విభాగం డైరెక్టర్ కాంతి వెస్లీ, ఫ్యాక్టరీల డైరెక్టర్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# మహా శివరాత్రి శుభాకాంక్షలు

- **టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్**

**బలగం టీవీ, హైదరాబాద్**



పవిత్రమైన మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని తెలుగు ప్రజలందరికీ టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పరమేశ్వరుడి ఆశీస్సులతో ప్రజల జీవితాల్లో శాంతి, సౌఖ్యం, ఐశ్వర్యం నిండాలని ఆకాంక్షించారు. ఉపవాస దీక్షలు, జాగరణలు, రుద్రాభిషేకాలు నిర్వహిస్తూ భక్తులు పరమ శివుని ఆరాధించడం మనలోని చెడు ఆలోచనలను తొలగించి, సత్సంకల్పాలతో ముందుకు సాగేందుకు ప్రేరణని స్తుందని అన్నారు. భోళా శంకరుడు సమానత్వానికి, సహనానికి ప్రతిరూపమనీ, సమాజంలో ఐక్యతను బలోపేతం చేసే విలువలను మనం ఆచరణలో పెట్టాలని సూచించారు. ప్రస్తుత కాలంలో మనుషుల మధ్య ప్రేమ, పరస్పర గౌరవం అవసరమనీ, శివరాత్రి సందేశం అదే అని మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. యువత సనాతన సంప్రదాయాలను గౌరవిస్తూ సమాజ సేవలో ముందుం డాలని పిలుపునిచ్చారు. ఈ మహా శివరాత్రి సందర్భంగా ప్రతి కుటుంబంలో ఆనందం వెల్లివిరియాలనీ, భక్తుల కోరికలు నెరవేరాలని ఆకాంక్షించారు.



# బీఆర్ఎస్––బీజేపీ మధ్య భవిష్యత్ కూటమి సంకేతాలు

- **వడ్డేపల్లిలో ఎలాంటి గందరగోళం లేదు**
- **తెలంగాణ జాగృతి నేత, మాజీ ఎమ్మెల్సీ కవిత**

**బలగం టీవీ, హైదరాబాద్**

ఇటీవల ముగిసిన మున్సిపల్ ఎన్నికలు బీఆర్ఎస్, బీజేపీ మధ్య సన్నిహితత పెరుగుతోందనే సంకేతాలు ఇస్తున్నాయని తెలంగాణ జాగృతి నేత, మాజీ ఎమ్మెల్సీ కే. కవిత శనివారం ఆరోపించారు. మున్సిపల్ ఎన్నికల ఫలితాలపై నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఉత్తర తెలంగాణ ప్రాంతాన్ని బీఆర్ఎస్ బీజేపీకి వదిలేసి, మిగతా ప్రాంతాలను బీజేపీ బీఆర్ఎస్‌కు వదిలినట్లుగా పోలింగ్ తీరు కనిపించిందని కవిత అన్నారు. ఇది ఇరుపార్టీల మధ్య మౌన ఒప్పందానికి సంకేతమై ఉండవచ్చని, భవిష్యత్‌లో కూటమికి ఇది తొలి అడుగై ఉండొచ్చని ఆమె వ్యాఖ్యానించారు.

తెలంగాణ జాగృతి సంస్థ ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ జెండా కింద పోటీ చేసి మున్సిపాలిటీల్లో 40కు పైగా సీట్లు గెలుచుకున్నట్లు కవిత తెలిపారు. జోగులాంబ గద్వాల్ జిల్లా వడ్డేపల్లి మున్సిపాలిటీని కూడా కైవసం చేసుకున్నామని చెప్పారు. కొన్ని అభ్యర్థులకు బి–ఫారాలు ఇవ్వడంలో సమస్యలు ఉన్నప్పటికీ, వారు స్వతంత్రులుగా గెలిచి తెలంగాణ జాగృతితోనే ఉన్నారని పేర్కొన్నారు. ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ. జోజి రెడ్డితో కలిసి కవిత ఈ సమావేశంలో పాల్గొన్నారు. వడ్డేపల్లిలో ఎలాంటి గందరగోళం లేదని, తెలంగాణ జాగృతి––ఫార్వర్డ్ బ్లాక్ కలిసి ఆ మున్సిపాలిటీని నడిపిస్తాయని స్పష్టం చేశారు.

మున్సిపల్ ఫలితాలు కేవలం ట్రైలర్ మాత్రమేనని, తెలంగాణలో కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయంగా తెలంగాణ జాగృతి ఎదుగుతుందని కవిత అన్నారు. "ఇది ట్రైలర్ మాత్రమే, పూర్తి చిత్రం ఇంకా ముందుంది" అని వ్యాఖ్యానించారు.బీఆర్ఎస్ కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లో సమర్థంగా ఎత్తిచూపడంలో విఫలమైందని కవిత విమర్శించారు. మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ నిరాశాజనక ఫలితాలు సాధించడం, మాజీ ఎంఏడయూడీ మంత్రి కేటీఆర్ చేసిన పట్టణాభివృద్ధి వాదనలపై ప్రజలు విశ్వసించలేదని సూచిస్తోందన్నారు. కొత్తగూడెంలో సీపీఐ అడగకపోయినా బీఆర్ఎస్ మద్దతు ప్రకటించడం పై కూడా ఆమె వ్యాఖ్యానించారు. "గతంలో సీపీఐని 'తోక పార్టీ' అని పిలిచిన బీఆర్ఎస్, ఇప్పుడు అదే పార్టీకి తోకగా మారినట్టుంది" అంటూ కవిత వ్యంగ్యంగా అన్నారు. మొత్తంగా మున్సిపల్ ఎన్నికల ఫలితాలు రాష్ట్ర రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు దారితీసే సూచనలు ఇస్తున్నాయని ఆమె అభిప్రాయపడ్డారు.

# టీజీ ఈఏపీసెట్––2026 నోటిఫికేషన్ విడుదల

(మొదటి పేజీ తరువాయి)

ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థులు ఈ పరీక్ష రాయడానికి అర్హులు.

**పరీక్ష తేదీలు**

బైపీసీ స్ట్రీమ్ (అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ):
మే 4, మే 5, 2026
ఇంజినీరింగ్ స్ట్రీమ్:
మే 9 నుంచి మే 11, 2026 వరకు

పరీక్షల అనంతరం ప్రాథమిక కీ విడుదల చేసి అభ్యంతరాలను స్వీకరిస్తారు. తదుపరి తుది కీతో పాటు ర్యాంకులను ప్రకటిస్తారు.

**కౌన్సెలింగ్ ప్రక్రియ**

అభ్యర్థులు సాధించిన ర్యాంకుల ఆధారంగా సీట్ల కేటాయింపు జరుగుతుంది. విడతల వారీగా కౌన్సెలింగ్ నిర్వహించి సీట్లు భర్తీ చేస్తారు. కౌన్సెలింగ్ అనంతరం సీట్లు మిగిలితే స్పాట్ అడ్మిషన్లపై ఉన్నత విద్యా మండలి నిర్ణయం తీసుకోనుంది. ఇంటర్, జేఈఈ పరీక్షల షెడ్యూల్ దృష్ట్యా ముందుగానే సమగ్ర ప్రణాళికతో షెడ్యూల్ ఖరారు చేసి నోటిఫికేషన్ విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు.

అధికారిక వెబ్‌సైట్: https://eapcet.tgche.ac.in/



## బాలుడిని తీవ్రంగా గాయపర్చిన అంగన్వాడీ టీచర్‌ను సస్పెండ్ చేయాలి..

- **జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు మ్యాకల పర్శరాములు**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

రాజన్న సిరిసిల్ల జిల్లా, ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపురం గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో చిన్నారి విధ్వనిష్‌కు తీవ్ర గాయాలు కావడం అత్యంత విచారకరం మరియు ఆందోళనకరం అని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు మ్యాకల పర్శరాములు తెలిపారు. చిన్నారి ప్రాణాపాయం తప్పినప్పటికీ, ఈ ఘటన అంగన్వాడీ కేంద్రాల్లో భద్రతా లోపాలను స్పష్టంగా వెలుగులోకి తెచ్చిందని ఆయన పేర్కొన్నారు.

పిల్లల భద్రత విషయంలో ఎటువంటి నిర్లక్ష్యాన్ని సహించరాదని స్పష్టం చేసిన ఆయన, ఈ ఘటనకు నైతిక బాధ్యత వహించాల్సిన అంగన్వాడీ టీచర్ రాణిని వెంటనే సస్పెండ్ చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం తరపున గట్టిగా డిమాండ్ చేశారు. పూర్తి స్థాయి విచారణ పూర్తయ్యే వరకు ఆమెను విధుల నుండి తప్పించి, సమగ్ర దర్యాప్తు జరిపి నిజానిజాలు బయటపెట్టాలని కోరారు. బాధిత చిన్నారికి ఉత్తమ వైద్యం అందేలా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని, కుటుంబానికి తగిన న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో కట్టుదిట్టమైన పర్యవేక్షణ వ్యవస్థను అమలు చేయాలని సూచించారు. పిల్లల ప్రాణాల విషయంలో ఎటువంటి రాజీ ఉండదని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు మ్యాకల పర్శరాములు బాధిత కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించి, చిన్నారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని కుటుంబానికి ధైర్యం చెప్పారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం తరపున పూర్తి అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం మహిళా విభాగం నాయకురాళ్లు పాల్గొన్నారు.



## అంగన్వాడీ విద్యార్థులకు యూనిఫామ్ పంపిణి

**బలగం టీవీ, ఇల్లంతకుంట**

ఇల్లంతకుంట మండలంలోని వెలిజీపూర్ గ్రామంలోని స్థానిక అంగన్వాడీ కేంద్రంలో విద్యార్థులకు సర్పంచ్ నాయిని నవీన్ కుమార్ యూనిఫామ్ లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ నాయిని నవీన్ కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవంపల్లి సత్యనారాయణ సహకారంతో ప్రభుత్వం చిన్నారుల సంక్షేమం కోసం తీసుకుంటున్న పలు సంక్షేమ కార్యక్రమాల్లో భాగంగా అంగన్వాడి పిల్లలకు ఉచిత యూనిఫాంల పంపిణీ కార్యక్రమం చేపట్టడం గొప్ప విషయం అన్నారు. ఈ యూనిఫాం పంపిణీ కార్యక్రమం ద్వారా పిల్లల్లో సమానత్వ భావన పెంపొందించడంతో పాటు, విద్యపై ఆసక్తి పెరుగుతుంది. అలాగే తల్లిదండ్రులపై ఆర్థిక భారం తగ్గించే మంచి కార్యక్రమమని కొనియాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ పథకం ప్రజలకు పూర్తిగా చేరేలా గ్రామపంచాయతీ తరపున కృషి చేస్తామని సర్పంచ్ నవీన్ హామీ ఇచ్చారు. ప్రతి తల్లిదండ్రి తమ పిల్లలను అంగన్వాడి కేంద్రాలకు క్రమం తప్పకుండా పంపించి, ప్రభుత్వం అందిస్తున్న సేవలను వినియోగించుకోవాలని కోరారు. గ్రామ చిన్నారులు ఆరోగ్యంగా, విద్యావంతులుగా ఎదగాలని ఆకాంక్షిస్తున్నాను అని సర్పంచ్ అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, వార్డు సభ్యులు గొల్ల కమిటీ మల్లవ్వ శంకర్, సంగెం ముత్తవ్వ, బొల్లారం ప్రసన్న కుమార్‌బి అంగన్వాడీ టీచర్ మంజుల, సహాయకురాలు సత్తవ్వ లు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికల్లో రెండు చోట్ల విజయం సంతోషకరం

- **జీహెచ్ఎంసీ ఎన్నికల్లోనూ పోటీ చేస్తాం: జనసేన తెలంగాణ విభాగం**

**బలగం టీవీ, హైదరాబాద్**

తెలంగాణలో జరిగిన మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల్లో రెండు చోట్ల విజయం సాధించడం సంతోషకరమని జనసేన పార్టీ తెలంగాణ విభాగం ప్రకటించింది. ఇదే ఉత్సాహంతో జీహెచ్ఎంసీ ఎన్నికల్లోనూ పోటీ చేస్తామని స్పష్టం చేసింది. హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో రాష్ట్ర నాయకులు మీడియా సమావేశం నిర్వహించారు.జనసేన తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొంగునూరి మహేందర్ రెడ్డి మాట్లాడుతూ, మున్సిపల్ ఎన్నికల్లో 330కు పైగా అభ్యర్థులను పార్టీ బరిలో నిలిపిందన్నారు. మంచిర్యాల్ కార్పొరేషన్ 34వ డివిజన్ నుంచి జనసేన అభ్యర్థి అగ్గు సాగర్ 31 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారని తెలిపారు. అలాగే సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మున్సిపాలిటీలో 14వ వార్డు నుంచి ఆరూరి విజయలక్ష్మి నాగేశ్వరరావు 29 ఓట్ల మెజారిటీతో గెలిచారని వెల్లడించారు.మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల్లో పార్టీకి మద్దతు ఇచ్చిన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. పార్టీ నాయకులు, శ్రేణులు, వీర మహిళలు కష్టపడి పనిచేసిన ఫలితమే ఈ విజయమని పేర్కొన్నారు. తక్కువ సమయంలోనే పార్టీ గెలుపు కోసం శ్రమించిన అందరికీ పార్టీ అధినేత పవన్ కల్యాణ్ తరపున కృతజ్ఞతలు తెలిపారు.తెలంగాణ పార్టీ ఇన్‌ఛార్జ్ నేమూరి శంకర్ గౌడ్ మాట్లాడుతూ రెండు చోట్ల విజయం పార్టీకి ఉత్సాహాన్నిచ్చిందన్నారు. రాబోయే ఎన్నికల్లోనూ పోటీ చేస్తామని స్పష్టం చేశారు. పార్టీ రాష్ట్ర నాయకుడు రాజలింగం మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితోనే పవన్ కల్యాణ్ పార్టీని స్థాపించారని పేర్కొన్నారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లాలని పిలుపునిచ్చారు.

## రాజన్న ఆలయ విస్తరణ పనుల్లో వేగం పెంచాలి..

- **సీఎం ప్రిన్సిపల్ సెక్రెటరీ కే ఎస్ శ్రీనివాస్ రాజ్**

**బలగం టీవీ, వేములవాడ:**

రాజన్న ఆలయ విస్తరణ పనుల్లో వేగం పెంచాలని సీఎం ప్రిన్సిపల్ సెక్రెటరీ కే ఎస్ శ్రీనివాస్ రాజ్ ఆదేశించారు. శ్రీ భీమేశ్వర ఆలయంలో స్వామివారిని దర్శించుకునేందుకు వేములవాడకు రాగా, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ పుష్పగుచ్ఛం అందజేసి, స్వాగతం పలికారు. శ్రీ భీమేశ్వర ఆలయంలో అర్చకులు సీఎం ప్రిన్సిపల్ సెక్రెటరీ కే ఎస్ శ్రీనివాస్ రాజ్ కు స్వస్తితో స్వాగతం పలికారు. ఆలయంలో స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయనకు అర్చకులు స్వామివారి ప్రసాదాన్ని అందజేసి, ఆశీర్వచనం అందించారు.

**ఆలయ విస్తరణ పనుల పరిశీలన**

రాజన్న ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులను సీఎం ప్రిన్సిపల్ సెక్రెటరీ కే ఎస్ శ్రీనివాస్ రాజ్, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా పనులకు సంబంధించిన ఫోటోలు పరిశీలించారు. పనులపై పలు సూచనలు చేశారు.

**ఉచిత బస్సు సర్వీసులు ప్రారంభం**

వేములవాడ తిప్పాపూర్ బస్టాండ్ నుంచి ఆలయం దాకా భక్తులను ఉచితంగా తరలించే ఆర్టీసీ బస్సులను సీఎం ప్రిన్సిపల్ సెక్రెటరీ కే ఎస్ శ్రీనివాస్ రాజ్, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ తో కలిసి ప్రారంభించారు.

**ప్రణాళిక ప్రకారం పూర్తి చేయాలి**

రాజన్న ఆలయ విస్తరణ, అభివృద్ధి



పనులను ఒక ప్రణాళిక ప్రకారం పూర్తి చేయాలని సీఎం ప్రిన్సిపల్ సెక్రెటరీ కే ఎస్ శ్రీనివాస్ రాజ్ ఆదేశించారు. రాజన్న ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులపై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ తో కలిసి ఆర్ అండ్ బీ, ఆలయ అధికారులు, ఆర్కిటెక్ట్ మూర్తి, కాంట్రాక్టర్ తో సమీక్ష సమావేశం నిర్వహించారు.

ప్రధాన ఆలయ విస్తరణ, ఇతర ప్రతి అభివృద్ధి పనికి సంబంధించి ఒక ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్లాలని సూచించారు. పనుల్లో వేగం పెంచాలని, అవసరమైన పని వారి సంఖ్య మరింత పెంచాలని ఆదేశించారు. పనుల పురోగతిలో ఏమైనా ఇబ్బందులు ఎదురైతే వాటిని సమన్వయంతో పరిష్కరించాలని తెలిపారు. నాణ్యతతో పనులను పూర్తి చేయాలని సూచించారు. నూతన గోశాల నిర్మాణం, ఇతర అంశాలపై చర్చించారు. ఇప్పుడు ఉన్న గోశాలలో ఎన్ని కోడెలు ఉన్నాయని ఆరా తీశారు. వాటి సంరక్షణ తదితర అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. రాజన్న ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులు, బద్ది పోచమ్మ ఆలయ విస్తరణ, గుడి చెరువు బండ్ పార్క్ పనులపై సీఎం ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీనివాస్ రాజ్ కు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఏర్పాటు చేసి వివరించారు. ఈ సమావేశంలో ఆలయ ఈవో రమాదేవి, ఆర్అండ్ బీ సీఈ రాజేశ్వర్, ఎస్ఈ రాములు ఈఈ నరసింహాచారి, ఆలయ ఈఈ రాజేష్, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమా..

- **ఇదేనా ప్రజాపాలన..!**
- **కంచర్ల రవి గౌడ్ అగ్రహం**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండలం జక్కల్ శివారులోని ఎస్టీ ఆశ్రమ పాఠశాలలో భోజనం సరిగా లేదని ఆరోపిస్తూ విద్యార్థులు రోడ్డుపైకి వచ్చి ఆందోళన వ్యక్తం చేసిన ఘటనపై కంచర్ల రవి గౌడ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.శనివారం సిరిసిల్లలోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ నేత కంచర్ల రవి గౌడ్? మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న పరిస్థితి నెలకొన్నదని ఆయన విమర్శించారు. విద్యార్థులు ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వానికి ఏమాత్రం స్పందన లేకపోవడం దురదృష్టకరమని దుయ్యబట్టారు.

తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు నాయకత్వంలో గురుకులాలను దేశంలోనే నెంబర్ వన్ స్థాయికి తీసుకెళ్లిన విషయాన్ని గుర్తుచేశారు. అయితే ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యాశాఖను తన వద్దే ఉంచుకున్నప్పటికీ విద్యార్థుల సమస్యలను పట్టించుకోకపోవడం బాధాకరమని అన్నారు. రాష్ట్రంలో గురుకులాలు, పాఠశాలల్లో విద్యార్థులు తరచూ ఆందోళన చేయాల్సి వస్తోందని పేర్కొంటూ, "విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నరు... ఇదేనా




ఇందిరమ్మ రాజ్యం, ప్రజాపాలన?" అని ప్రశ్నించారు.

పాఠశాలలో చదువుకోవాల్సిన విద్యార్థులను రోడ్డుమీదకు తీసుకొచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని మండిపడ్డారు. ఇలాంటి ఘటనలు పునరావృతమవుతున్నప్పటికీ ముఖ్యమంత్రి సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం కూడా నిర్వహించకపోవడం బాధాకరమని అన్నారు. విద్యార్థులందరికీ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తరపున పూర్తి మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఎక్కడ విద్యార్థులకు అన్యాయం జరిగినా పార్టీ అండగా ఉంటుందని కంచర్ల రవి గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అరెల్లి వినయ్ కుమార్, కె విష్ణు, కె సిద్ధార్థ, కె మణి శర్మ, కె జశ్వంత్, సాయి తేజ కె, కె వర్షిత్ తదితరులు పాల్గొన్నారు.

## వీణవంకలో మహాశివరాత్రి వేడుకలకు సర్వం సిద్ధం

- **వెయ్యేళ్ల చరిత్రగల శివాలయంలో వైభవంగా ఉత్సవాలు**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

వీణవంక మండల కేంద్రంలోని అతిపురాతన శివాలయంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో నేడు జరుగనున్న మహాశివరాత్రి వేడుకలకు ఆలయ కమిటీలు ఘనంగా ఏర్పాట్లు పూర్తి చేశాయి. వెయ్యేళ్ల చరిత్ర కలిగిన శివాలయంలో భక్తులకు అన్ని విధాలైన సదుపాయాలు కల్పించినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ప్రముఖ వేదపండితులు గూడ జగదీశ్వరశర్మ ఆధ్వర్యంలో శివపార్వతుల కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

**ఉత్సవాల కార్యక్రమాలు**

ఉదయం గోపూజ
ద్వాదశ జ్యోతిర్లింగాల దర్శనం
సామూహిక మహారుద్రాభిషేకం
ఎదుర్కోళ్ళు
రాత్రి శివపార్వతుల కల్యాణం
అర్ధరాత్రి లింగోద్భవం
అనంతరం ఊంజల్ సేవ
ఆదివారం ఉదయం అన్నపూజ
మధ్యాహ్నం మహా అన్నదానం
సాయంత్రం రథోత్సవం

ఆలయ కమిటీ చైర్మన్ రామిడి శ్రీనివాస్ మాట్లాడుతూ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని కోరారు. మండల కేంద్రంతో పాటు నర్సింగాపూర్, చల్లూరు, మామిడాలపల్లి, ఎలుబాక, వలాపూర్, పోతిరెడ్డిపల్లి, కొండపాక, రెడ్డిపల్లి, ఘన్ముక్ల గ్రామాల ఉత్సవ కమిటీ చైర్మన్లు కూడా వేడుకలను విజయవంతం చేయాలని భక్తులను ఆహ్వానించారు. మహాశివరాత్రి సందర్భంగా మండల వ్యాప్తంగా భక్తి వాతావరణం నెలకొంది.

# భారత్ పాక్ హైవోల్టేజ్ పోరు నేడు



- సూపర్-8 బెర్తుపై కన్నేసిన ఇరుజట్లు
- వర్షం ముప్పుతో అభిమానుల్లో ఆందోళన

**బలగం టీవీ, కొలంబో**

క్రికెట్ ప్రపంచం ఆసక్తిగా ఎదురుచూస్తున్న హైవోల్టేజ్ మ్యాచ్‌కు రంగం సిద్ధమైంది. ఆదివారం కొలంబో వేదికగా చిరకాల ప్రత్యర్థులు భారత్, పాకిస్థాన్ తలపడనున్నాయి. టోర్నీలో పాక్‌పై ఘనమైన రికార్డు కలిగిన భారత్ మరోసారి అదే ఫలితాన్ని పునరావృతం చేయాలనే పట్టుదలతో ఉంది. మరోవైపు ఈసారైనా గెలిచి ఆధిపత్యాన్ని చాటుకోవాలని పాక్ భావిస్తోంది.ఇప్పటికే చెరో రెండు మ్యాచ్‌లు గెలిచిన ఇరుజట్లు ఈ మ్యాచ్‌లో విజయం సాధించి సూపర్–8 బెర్తును ఖరారు చేసుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నాయి. గ్రూప్–ఏలో భారత్ అమెరికా, నమీబియాలను ఓడించగా, పాకిస్థాన్ నెదర్లాండ్స్, అమెరికాపై విజయం సాధించింది. ఇరుజట్లు పరిపూర్ణ రికార్డుతో కొలంబోకు చేరుకున్నాయి.

మ్యాచ్ జరుగనున్న ఆర్. ప్రేమదాస స్టేడియం పిచ్ స్పిన్‌కు అనుకూలంగా ఉండే అవకాశాలు ఉన్న నేపథ్యంలో ఇరుజట్లు స్పిన్ బలాన్నే నమ్ముకుని బరిలోకి దిగనున్నాయి. అయితే వర్షం ముప్పు పొంచి ఉండడంతో అభిమానుల్లో ఆందోళన నెలకొంది.

**అభిషేక్ రాకతో బలం**

ఈ మ్యాచ్‌లో టీమ్ ఇండియా పలు మార్పులతో బరిలోకి దిగనుంది. అనారోగ్యం నుంచి కోలుకుని డాషింగ్ ఓపెనర్ అభిషేక్ శర్మ అందుబాటులోకి రావడం జట్టుకు అదనపు బలాన్నిచ్చింది. ఆయన రాకతో సంజూ శాంసన్ బెంచ్‌కు పరిమితం కానున్నాడు.ఫామ్‌లో ఉన్న ఇషాన్ కిషన్, సూర్యకుమార్ యాదవ్ జట్టుకు ధైర్యాన్నిస్తున్న అంశాలు. తిలక్ వర్మ దూకుడుగా ఆడాల్సిన అవసరం ఉంది. మిడిల్, లోయర్ ఆర్డర్ బ్యాటర్లు కీలక పాత్ర పోషించాల్సి ఉంది. పేస్ ఆల్‌రౌండర్లు హార్దిక్ పాండ్యా, శివమ్ దూబే ఫామ్‌ను కొనసాగించాల్సి ఉంది. అక్షర్ పటేల్కు తోడుగా యువ స్పిన్ ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్ జట్టులోకి రానున్నాడు. స్పిన్ పిచ్ దృష్ట్యా సుందర్‌ను ఆడించే అవకాశం ఉంది.సుందర్ రాకతో గత రెండు మ్యాచ్‌ల్లో విఫలమైన రింకూ సింగ్ను పక్కనపెట్టే సూచనలు కనిపిస్తున్నాయి. ప్రధాన స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి ప్రదర్శనపై జట్టు భారీ ఆశలు పెట్టుకుంది. స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా, అర్షదీప్ సింగ్లు పేస్ భారాన్ని పంచుకోనున్నారు. హైవోల్టేజ్ పోరులో ఎవరు పైచేయి సాధిస్తారన్నది ఆదివారం తేలనుంది.

**మ్యాచ్‌కు వర్షం ముప్పు**

క్రికెట్ ప్రపంచం ఆసక్తిగా ఎదురుచూస్తున్న భారత్–పాకిస్థాన్ టీ20 ప్రపంచకప్ గ్రూప్ మ్యాచ్‌కు వర్షం ముప్పు పొంచి ఉంది. శ్రీలంక నేచురల్ హజార్డ్స్ ఎర్లీ వార్నింగ్ సెంటర్ ప్రకారం ప్రాంతంలో దక్షిణ––తూర్పు బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉంది. శ్రీలంక వాతావరణ శాఖ కూడా ఇదే విషయాన్ని ధృవీకరించింది. దీంతో మ్యాచ్ సమయంలో వర్షం అంతరాయం కలిగించే అవకాశాలు ఉన్నాయని అధికారులు సూచించారు.అక్యూవెదర్ అంచనాల ప్రకారం, ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు 70––80 శాతం వరకు వర్షం కురిసే అవకాశం ఉంది. అయితే మ్యాచ్ ప్రారంభ సమయమైన రాత్రి 7 గంటలకు వర్షావకాశం 9%కు తగ్గే సూచనలు ఉన్నాయి. అయినప్పటికీ 100% మేఘావృతం ఉండొచ్చని అంచనా. సుమారు 12.1 మి.మీ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉండగా, 26% పిడుగుపాట్ల ముప్పు కూడా ఉందని నివేదికలు చెబుతున్నాయి.ప్రేమదాస స్టేడియంలో పూర్తి స్థాయి కవర్లు, ఆధునిక డ్రైనేజీ వ్యవస్థ ఉండటంతో వర్షం ఆగిన 20 నిమిషాల్లో ఆట పునఃప్రారం భం చేసే సౌకర్యం ఉంది. అయితే తరచూ వర్షం పడితే ఓవర్లు తగ్గించే పరిస్థితి నెలకొనవ చ్చు. గ్రూప్ దశలో ఈ మ్యాచ్‌కు రిజర్వ్ డే లేకపోవడం గమనార్హం. మ్యాచ్ పూర్తిగా రద్దైతే ఇరుజట్లకు ఒక్కో పాయింట్ చొప్పున కేటాయిస్తారు.



# ఒమన్‌పై ఐర్లాండ్ ఘనవిజయం

- 96 పరుగుల తేడాతో టీ20 ప్రపంచకప్‌లో సత్తాచాటిన ఐరిష్ జట్టు

**బలగం టీవీ, కొలంబో**

టీ20 ప్రపంచకప్ 2026లో భాగంగా ఒమన్‌తో జరిగిన మ్యాచ్‌లో ఐర్లాండ్ జట్టు 96 పరుగుల భారీ తేడాతో విజయం సాధించింది. కొలంబోలోని సింహళీస్ స్పోర్ట్స్ క్లబ్ వేదికగా జరిగిన ఈ పోటీలో ఐర్లాండ్ బ్యాటర్లు పరుగుల వర్షం కురిపించగా, బౌలర్లు కట్టుదిట్టమైన ప్రదర్శనతో ఒమన్‌ను చిత్తు చేశారు.

టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న ఒమన్ నిర్ణయం పూర్తిగా బెడిసికొట్టింది. ముందుగా బ్యాటింగ్ చేసిన ఐర్లాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 235 పరుగుల భారీ స్కోరు నమోదు చేసింది. కెప్టెన్, వికెట్ కీపర్ లోర్కాన్ టక్కర్ 51 బంతుల్లో 94 పరుగులు (10 ఫోర్లు, 4 సిక్సులు) చేసి నాటౌట్‌గా నిలిచి జట్టుకు బలమైన పునాది వేశాడు. అతనికి గారెత్ డెలానీ 30 బంతుల్లో 56 పరుగులు (3 ఫోర్లు, 4 సిక్సులు) చేసి అండగా నిలిచాడు. చివర్లో జార్జ్ డాక్రెల్ 9 బంతుల్లో 35 పరుగులు (5 సిక్సులు) సాధించి స్కోరును పరుగులు పెట్టించాడు. ఒమన్ బౌలర్లలో షకీల్ అహ్మద్ మూడు వికెట్లు తీశాడు.

236 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన ఒమన్ జట్టు ఏ దశలోనూ గెలుపు దిశగా సాగలేదు. ఆమిర్ కలీమ్ (50), హమ్మద్ మీర్జా (46) కొంత ప్రతిఘటించినప్పటికీ, మిగతా బ్యాటర్లు విఫలమయ్యారు. ఐర్లాండ్ బౌలర్ల కట్టుదిట్టమైన బౌలింగ్‌కు ఒమన్ 18 ఓవర్లలో 139 పరుగులకే ఆలౌట్ అయింది. ఐర్లాండ్ తరఫున జాషువా లిటిల్ 16 పరుగులిచ్చి 3 వికెట్లు పడగొట్టగా, బారీ మెకార్తీ, మాథ్యూ హంఫ్రీస్ చెరో రెండు వికెట్లు తీశారు. అద్భుత ఇన్నింగ్స్ ఆడిన లోర్కాన్ టక్కర్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది. ఈ విజయంతో ఐర్లాండ్ జట్టు టోర్నీలో తన ఆధిపత్యాన్ని చాటుకుంది.

# స్కాట్లాండ్‌పై ఇంగ్లాండ్ విజయం

**ఐదు వికెట్ల తేడాతో గెలుపు -- గ్రూప్-సిలో రెండో స్థానం**

**బలగం టీవీ, కొల్‌కతా**



టీ20 ప్రపంచకప్ 2026లో భాగంగా స్కాట్లాండ్‌పై ఇంగ్లాండ్ జట్టు ఐదు వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఈడెన్ గార్డెన్స్ వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన స్కాట్లాండ్ 20 ఓవర్లలో 152 పరుగులకు ఆలౌటైంది.

స్కాట్లాండ్ తరఫున ఎంఏ జోన్స్ (33), రిచీ బెరింగ్టన్ (49), టామ్ బ్రూస్ (24), ఆలివర్ డేవిడ్సన్ (20) రాణించారు. అయితే జార్జ్ మున్సే (4), బ్రాండన్ మెక్‌ముల్లెన్ (0), మైఖేల్ లీస్క్ (1), మాథ్యూ క్రాస్ (8), మార్క్ వాట్ (2), బ్రాడ్ వీల్ (2), బ్రాడ్ క్యూరీ (2) తక్కువ పరుగులకే ఔటయ్యారు. ఇంగ్లాండ్ బౌలర్లలో ఆదిల్ రషీద్ 3 వికెట్లు పడగొట్టగా, జోఫ్రా ఆర్చర్, లియామ్ డాసన్ చెరో రెండు వికెట్లు తీశారు. ఓవర్టన్, సామ్ కరెన్ తలో వికెట్ దక్కించుకున్నారు.

153 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఇంగ్లాండ్ ఆరంభంలో తడబడింది. ఓపెనర్లు ఫిల్ సాల్ట్, జోస్ బట్లర్ సింగిల్ డిజిట్‌కే వెనుదిరిగారు. పది ఓవర్లు ముగిసే సరికి 4 వికెట్ల నష్టానికి 86 పరుగులు మాత్రమే చేసింది. ఈ దశలో జేకబ్ బెథెల్ (32), టామ్ బాంటన్ (63) జట్టును ఆదుకున్నారు. బెథెల్ ఔటైన తర్వాత కరెన్ (22)తో కలిసి బాంటన్ అర్ధశతకం పూర్తి చేశాడు. చివరి వరకు క్రీజులో నిలిచిన బాంటన్ ఇంగ్లాండ్‌కు విజయాన్ని అందించాడు. స్కాట్లాండ్ బౌలర్లలో మెక్‌ముల్లెన్, కరీస్, వీల్, లీస్క్, డేవిడ్సన్ తలో వికెట్ తీశారు. ఈ విజయంతో ఇంగ్లాండ్ గ్రూప్–సిలో మూడు మ్యాచ్‌ల్లో రెండు విజయాలు సాధించి నాలుగు పాయింట్లతో రెండో స్థానంలో నిలిచింది. వెస్టిండీస్ జాతీయ క్రికెట్ జట్టు అగ్రస్థానంలో కొనసాగుతోంది.

# కివీస్‌పై సఫారీ సంచలనం

## హ్యాట్రిక్ విజయంతో సూపర్-8కు చేరువైన దక్షిణాఫ్రికా

**బలగం టీవీ, అహ్మదాబాద్**

టీ20 ప్రపంచకప్ 2026లో దక్షిణాఫ్రికా జట్టు తన జోరును కొనసాగిస్తోంది. లీగ్ దశలో బలమైన న్యూజిలాండ్‌ను 7 వికెట్ల తేడాతో చిత్తు చేసి వరుసగా మూడో విజయాన్ని నమోదు చేసింది. ఈ గెలుపుతో సూపర్–8 దశకు మరింత చేరువైంది.

భారీ లక్ష్య ఛేదనలో కెప్టెన్ ఎడెన్ మర్క్‌రమ్ 86 పరుగులతో నాటౌట్‌గా నిలిచి జట్టును విజయతీరాలకు చేర్చాడు. అతనికి క్వింటన్ డికాక్ (20), రియాన్ రికెల్టన్ (21) శుభారంభం అందించారు. చివర్లో డేవిడ్ మిల్లర్ (24 నాటౌట్) పెర్గూసన్ వేసిన 18వ ఓవర్ తొలి బంతినే సిక్సర్‌గా మలచడంతో దక్షిణాఫ్రికా విజయాన్ని ఖరారు చేసింది.



అంతకుముందు టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ జాతీయ క్రికెట్ జట్టును దక్షిణాఫ్రికా బౌలర్లు కట్టడి చేశారు. ముఖ్యంగా మార్కో యాన్సెన్ 4 వికెట్లు తీసి కివీస్‌ను పవర్‌ప్లేలోనే కష్టాల్లోకి నెట్టాడు. ఒత్తిడిలోనూ మార్క్ చాప్‌మన్ (48) ధైర్యంగా ఆడగా, డారిల్ మిచెల్ (32)తో కలిసి 74 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పాడు. ఆఖర్లో జేమ్స్ నీషమ్ (23 నాటౌట్) మెరుపులతో కివీస్ నిర్ణీత ఓవర్లలో 175 పరుగులు సాధించింది. కానీ ఛేదనలో మర్క్‌రమ్ నాయకత్వంలో సఫారీ జట్టు దూకుడుగా ఆడి మ్యాచ్‌ను ఏకపక్షంగా మార్చింది. వరుసగా మూడో విజయంతో దక్షిణాఫ్రికా జట్టు టోర్నీలో తన ఆధిపత్యాన్ని మరింత బలపరుచుకుంది.

# మనవళ్ల పేర్లపై చిరంజీవి హర్షం

**సనాతన సాంస్కృతిక స్ఫూర్తి ప్రతిబింబించిందని ప్రశంసలు**

**బలగం టీవీ, హైదరాబాద్**

మెగాస్టార్ చిరంజీవి తన మనవళ్లు, మనవరాళ్లకు పెట్టిన పేర్లపై హర్షం వ్యక్తం చేశారు. తన కుమారుడు రామ్ చరణ్, కోడలు ఉపాసన కొణిదెల తీసుకున్న నిర్ణయాన్ని అభినందిస్తూ ప్రత్యేకంగా పోస్టు చేశారు. మన సనాతన సాంస్కృతిక వారసత్వం, ఆధ్యాత్మికత ఉట్టిపడేలా అర్థవంతమైన పేర్లను ఎంపిక చేశారని ప్రశంసించారు. "మా రెండు చిన్ని సంతోషాలకు పెట్టిన అందమైన పేర్లను ప్రశంసిస్తూ బంధువులు, స్నేహితులు, అభిమానుల నుంచి ఫోన్లు, సందేశాలు వస్తున్నాయి. మన సంస్కృతి, ఆలయాల ఆశీస్సులతో కూడిన పేర్లను ఎంచుకున్నందుకు గర్వంగా ఉంది. ప్రియమైన ఉపాసన, చరణ్‌లకు నా హృదయపూర్వక ప్రేమ, అభినందనలు" అని చిరంజీవి తన సందేశంలో పేర్కొన్నారు. ఈ పేర్లలో భక్తి, సాంస్కృతిక స్మృతి, తరతరాలుగా మనల్ని నడిపిస్తున్న దైవిక కరుణ ప్రతిబింబిస్తోందని ఆయన అన్నారు. అలాగే మనవరాలు అన్వీరకు తన నాయనమ్మ అంజనా దేవి పేరులోని 'దేవి'ని చేర్చడం ఎంతో ఆనందాన్నిచ్చిందని తెలిపారు. ఇది చరణ్ ఆలోచనా విధానానికి నిదర్శనమని పేర్కొన్నారు. చిన్నారులపై దైవ ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు.

కాగా, రామ్ చరణ్––ఉపాసన దంపతులకు ఇటీవల కవలలు (ఒక బాబు, ఒక పాప) జన్మించిన విషయం తెలిసిందే. వారికి శివరామ్ కొణిదెల, అన్వీర దేవి కొణిదెల అని నామకరణం చేశారు. ఈ పేర్ల వెనుక ఉన్న అర్థాలను కూడా రామ్ చరణ్ సోషల్ మీడియా వేదికగా వివరించారు. జనవరి 31న జన్మించిన ఈ కవలలతో ఈ దంపతులు రెండోసారి తల్లిదండ్రులయ్యారు.

# 'బ్యాండ్ మేళం' గ్లింప్స్‌కు విశేష స్పందన

**వాలెంటైన్స్ డే సందర్భంగా విడుదల -- మార్చి 13న థియేటర్లలోకి**

**బలగం టీవీ, హైదరాబాద్**



టాలీవుడ్ యంగ్ జంట హర్ష్ రోషన్––శ్రీదేవి కలిసి నటిస్తున్న లేటెస్ట్ లవ్ అండ్ ఎమోషనల్ ఎంటర్‌టైనర్ బ్యాండ్ మేళంపై రోజురోజుకీ ఆసక్తి పెరుగుతోంది. కొత్త దర్శకుడు సతీష్ జవ్వాజి తెరకెక్కిస్తున్న ఈ చిత్రాన్ని ప్రముఖ రచయిత కోన వెంకట్ సమర్పిస్తున్నారు. కోన ఫిలిం కార్పొరేషన్ బ్యానర్‌పై కావ్య, శ్రావ్యలు నిర్మిస్తున్న ఈ సినిమా ఇప్పటికే యువ ప్రేక్షకుల్లో మంచి బజ్‌ను సొంతం చేసుకుంది. ప్రేమికుల దినోత్సవాన్ని పురస్కరించుకుని చిత్రబృందం విడుదల చేసిన స్పెషల్ గ్లింప్స్‌కు విశేష స్పందన లభిస్తోంది. గ్లింప్స్‌లో హీరో తన ప్రేమను వ్యక్తపరుస్తూ చెప్పిన భావోద్వేగ డైలాగ్స్ ప్రేక్షకులను హత్తుకునేలా ఉన్నాయి. రొమాంటిక్ టోన్‌తో పాటు కుటుంబ భావోద్వేగాలను ప్రతిబింబించే సన్నివేశాలు సినిమాపై ఆసక్తిని మరింత పెంచాయి. విడుదలైన కొద్ది గంటల్లోనే గ్లింప్స్ సోషల్ మీడియాలో వైరల్ కావడం విశేషం. ఈ చిత్రం మార్చి 13న థియేటర్లలో విడుదల కానుంది. ఇప్పటికే గ్లింప్స్‌కు వస్తున్న స్పందన చూస్తే ఓపెనింగ్స్ బాగానే ఉండే అవకాశముందని అంచనా. కొత్త దర్శకుడి విజన్, కోన వెంకట్ సపోర్ట్, యంగ్ జంట కెమిస్ట్రీ––– ఇవన్నీ కలిసి 'బ్యాండ్ మేళం'ను యూత్‌ఫుల్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌గా నిలబెట్టే అవకాశముందని ఇండస్ట్రీలో చర్చ సాగుతోంది. మొత్తానికి వాలెంటైన్స్ డే సందర్భంగా విడుదలైన ఈ గ్లింప్స్ సినిమాపై అంచనాలను మరింత పెంచిందని చెప్పొచ్చు.